
## నిరుపేదలకు అండగా సత్యసాయి సేవాసంస్థ

**నారాయణఖేడ్, మే 15, ప్రభాతవార్త:**
నిరుపేదలకు అండగా శ్రీసత్యసాయి సేవాసంస్థ ఎల్లప్పుడూ ఉంటుందని, చూపుకోల్పోయిన వృద్ధులకు చూపునిచ్చే సంస్థ శ్రీ సత్యసాయి శంకర హాస్పిటల్ స్వచ్ఛంద సంస్థ అని సత్యసాయి ట్రస్ట్‌సభ్యులు శంకరప్ప గురువారం తెలిపారు. సంగారెడ్డిజిల్లా నారాయణఖేడ్ పట్టణంలోని సత్యసాయి మందిరంలో కంటిచూపు కోల్పోయిన వృద్ధులకు 65మందికి పైగా వృద్ధులకు హైదరాబాద్‌లోని శంకర హాస్పిటల్ లో ఉచిత కంటి ఆపరేషన్ చేసి చూపులేని వృద్ధులకు చూపుని ఇవ్వాలనే లక్ష్యంతో మాసంస్థ ముందు కెళ్తుందన్నారు. నారాయణఖేడ్, జహీరాబాద్ ప్రాంతాలలో నిరుపేదకుటుంబాలు ఆర్థికంగా వెనుకబడిన వారికి చూపునీయాలని ధృఢ సంకల్పంతో ముందుకెళ్లి ఈ ప్రాంతంలో ఇప్పటివరకు 1200 మందికి చూపునిచ్చిన ఘనత శ్రీసత్యసాయి, శంకరహాస్పిటల్ సంయుక్తంగా నిర్వహిస్తున్న సంస్థకే దక్కుతుం దన్నారు. కార్యక్రమంలో రాదేశం, ప్రశాంత్ ఫోన్ ఎక్స్ పౌండేషన్, విజయన్ శేఖర్, రూపేందర్ కుమార్, జోష్ణ, సలీఫా, జి. రాజు, గుండ్రెడ్డి, మాజీసర్పంచ్‌అంబికానర్సింలు, వృద్ధులు పాల్గొన్నారు.



# మెదక్ | సంగారెడ్డి | సిద్దిపేట
# వార్త

## అందాల పోటీల మీద ఉన్న శ్రద్ధ రైతులపై లేదు

**కొండాపూర్, మే 15, ప్రభాతవార్త:**
అందాల పోటీల మీద ఉన్న శ్రద్ధ రైతులపై లేదని స్థానిక ఎమ్మెల్యే చింత ప్రభాకర్ పేర్కొన్నారు. గ్రామంలో తడిసిన ధ్యాన్యాన్ని ఆయన పరిశీలించి అక్కడ రైతులతో మాట్లాడుతూ ప్రభుత్వం సక్రమంగా ధాన్యం సేకరణ చేపట్టక పోవడం వల్లే రైతులు నష్టపోయారని అన్నారు. ఎద్దు ఏడ్చిన వ్యవసాయం రైతు ఏడ్చిన రాజ్యం బాగుపడినట్లు చరిత్రలో లేదన్నారు, అధికారుల నిర్లక్ష్యం వల్ల సకాలంలో ధాన్యం సేకరణ చేయడంలో ప్రభుత్వం విఫలం అయ్యిందన్నారు. నామమాత్రంగా ధాన్యం కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేశారని, సెంటర్లలో కనీస సౌకర్యాలు లేవన్నారు. టార్పాలిన్లు లేక ధాన్యం తడిసిందన్నారు. తడిసిన ధాన్యాన్ని పూర్తిస్థాయిలో ప్రభుత్వమే కొనుగోలు చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ధాన్యపు రాశుల చుట్టూ తిరగాల్సిన వారు అందాల రాశుల చుట్టూ తిరుగుతున్నారని పేర్కొన్నారు. కార్యక్రమంలో మండలపార్టీ అధ్యక్షులు విఠల్, కార్యదర్శి గోవర్ధన్ రెడ్డి, పిఏసిఎస్ చైర్మన్ రాజు, పాండు, పవన్, నాగేష్ అధికారులు పాల్గొన్నారు.

# ఆర్పీల అవినీతిపై విచారణ షురూ

**-సుమారు రూ.45 లక్షల అవినీతి**
**-బ్యాంకు అధికారుల సహకారంతోనే..?**
**-జిల్లా ఆడిట్ అధికారిణి జయశ్రీ**

**గజ్వేల్, మే 15, ప్రభాతవార్త:**
గజ్వేల్ పట్టణంలో ఆర్‌పిల అవినీతిపై జిల్లా ఆడిట్ అధికారిణి జయశ్రీ, మున్సిపల్ కమిషనర్ గోల్కొండ నర్సయ్యలు గురువారం విచారణ ప్రారంభించారు. గజ్వేల్ మున్సిపల్ కార్యాలయం లో శివశంకర్, నెప్రూతోపాటు పలుగ్రూపుల మహిళాసభ్యులను పిలిపించి విచారణ చేపట్టారు. విచారణలో ఒకేరోజు ఫోటోలు అతికించి బ్యాంకు లో ఖాతాతెరిచి అదేరోజు లోన్ తీసుకోవడం పట్ల ఆశ్చర్యం వ్యక్తంచేశారు. బ్యాంకు, మెప్మా అధికా రులు, రిసోర్స్ పర్సన్‌లు కుమ్మక్కై ఈ అవినీతి భాగోతానికి తెరలేపినట్లు తెలుస్తుందన్నారు. అమాయక మహిళలను గ్రూపులుగా ఏర్పాటు చేసి వారికి ఎలాంటి అవగాహన లేనివారిని ఎంచుకొని బ్యాంకు అధికారులతో కుమ్మక్కై గ్రూపు లోన్లు మంజూరు చేయడం, మంజూరు చేసిన డబ్బులు సైతం గ్రూపుమహిళలకు ఇవ్వకుండా వారిస్వంతా నికి వినియోగించుకున్నట్లు విచారణలో తేలినట్లు తెలిపారు. ఒకరికొకరు సంబంధంలేకుండా మహిళాగ్రూపులను ఏర్పాటు చేసి రెండేసి బ్యాంకులలో మహిళలకు రుణాలు మంజూరు చేయించారని తెలిపారు. బ్యాంకు అధికారులు ఇంత మోసాన్ని పసిగట్టకుండా కళ్లుమూసుకొని బ్యాంకు రుణాలు మంజూరు చేయడం ఏమిటని ప్రశ్నించారు. మహిళా గ్రూపులను మోసంచేసిన ఘనత ఇక్కడి అధికారులకే దక్కుతుందన్నారు. బ్యాంకు అధి కారుల సహకారంతోనే అవినీతి జరిగినట్లు తెలుస్తుందని ఇంకా విచారణ పూర్తి కాలేదన్నారు. అమాయక మహిళలనుచూసి వారిపేరుపై గ్రూపు లోన్లు మంజూరు చేయించి వాటిని వారిఖాతాల్లో జమచేయించుకోవడం లాంటివి విచారణలో తేలిం దన్నారు. మరో వారంరోజుల్లో మరో నాలుగు గ్రూపులను విచారణ చేసిన తర్వాత పూర్తి నివేదికను పై అధికారులకు అందిస్తామన్నారు. గురువారం మూడు గ్రూపు సభ్యుల వివరాలను తెలుసుకోగా సుమారు రూ.45లక్షల అవినీతి జరిగినట్లు తెలి సిందన్నారు. జిల్లా అధికారులు విచారణ చేపట్టడంతో సంచలన విషయాలు బయటకు వస్తున్నట్లు తెలుస్తుంది. గ్రూప్‌లలో భారీయెత్తున అవినీతిజరిగినట్లు సమాచారం.



మహిళా గ్రూపు సభ్యులతో మాట్లాడుతున్న జిల్లా ఆడిట్ అధికారిణి జయశ్రీ

## గురుకుల పాఠశాలల్లో నాణ్యమైన ఉచితవిద్య
**-కలెక్టర్ మిక్కిలినేని మనుచౌదరి**


కరపత్రాలను ఆవిష్కరిస్తున్న కలెక్టర్ మిక్కిలినేని మనుచౌదరి తదితరులు

**సిద్దిపేట, మే 15, ప్రభాతవార్త ప్రతినిధి:**
జిల్లాలోని గురుకుల పాఠశాలలో నాణ్యమైన ఉచితవిద్య అందుతుందని జిల్లా కలెక్టర్ మిక్కిలినేని మనుచౌదరి అన్నారు. కలెక్టరేట్‌లో గురువారం 6మైనార్టీ గురుకులాల్లో 5వ తరగతిలో ప్రవేశం కోసం కరప్రతాలను ఆయన ఆవిష్కరించి మాట్లాడారు. ప్రభుత్వం ఇటీవలే కాస్మెటిక్ చార్జీలను పెంచిందన్నారు. 2025-26 సంవత్సరానికిగాను 5వతరగతిలో మైనార్టీ గురుకులాల్లో రిజిస్ట్రేషన్ చేసుకొని అడ్మిషన్ పొందాలన్నారు. ఈ అవకాశాన్ని మైనార్టీవిద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో ఆర్‌ఎల్‌సి సుధారాణి, జిల్లాలోని మైనార్టీ పాఠశాలల ప్రిన్సి పల్స్ తదితరులు పాల్గొన్నారు.

## ఇంటర్మీడియట్ అడ్వాన్స్ సప్లిమెంటరీ పరీక్షలు
**-సక్రమంగా విజయవంతంగా నిర్వహించాలి**
**-అదనపు కలెక్టర్ గరిమా అగర్వాల్**


సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా అదనపు కలెక్టర్ గరిమా అగర్వాల్

**సిద్దిపేట, మే 15, ప్రభాతవార్త ప్రతినిధి:**
ఇంటర్మీడియట్ అడ్వాన్స్ సప్లిమెంటరీ పరీక్షలు సక్రమంగా విజయవంతంగా నిర్వహించాలని జిల్లా అదనపుకలెక్టర్ గరిమాఅగర్వాల్ సంబంధితశాఖ అధికారులను ఆదేశించారు. జిల్లా కలెక్ట రేట్‌లో గురువారం ఇంటర్మీడియట్ అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీ పరీక్షల నిర్వహణ సంబంధిత అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ పరీక్షలను ప్రశాంత మైన వాతావరణంలో నిర్వహించడానికి పకడ్బందీగా ఏర్పాట్లు చేయాలన్నారు. ఈ నెల 22నుంచి 29వరకు రోజుకు రెండు సెషన్స్‌లలో పరీక్షల నిర్వహణకు జిల్లాలో 27 పరీక్షాకేంద్రాలను ఏర్పాటుచేసినట్లు తెలిపారు. ఉదయం 9గంటల నుంచి 12గంటల వరకు మొదటి సంవత్సరం విద్యార్థులకు, మధ్యాహ్నం 2.30నుంచి సాయంత్రం 5.30వరకు రెండోసంవత్సరం విద్యా ర్థులకు పరీక్షలు నిర్వహించడం జరుగుతుందన్నారు. పరీక్షలలో ఎలాంటి మాల్‌ప్రాక్టీస్ జగరకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలని ఆదేశించారు. సమావేశంలో డిఐఈఓ రవీందర్‌రెడ్డి, వివిధశాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## బ్యాంక్ అధికారులతో న్యాయమూర్తి సమీక్ష



బ్యాంక్ అధికారులతో సమావేశం అయిన న్యాయమూర్తి కవితాదేవి

**జహీరాబాద్, మే 15, ప్రభాతవార్త:**
జూన్ 14న జరుగనున్న జాతీయ లోక్ అదాలత్‌ను పురస్కరించుకుని గురువారం పట్టణంలోని కోర్టు ఆవరణలో సీనియర్ సివిల్ జడ్జి జి. కవితాదేవి బ్యాంక్ అధికారులతో ప్రత్యేకంగా సమావేశం అయ్యారు. ఈసందర్భంగా న్యాయమూర్తి కవితాదేవి బ్యాంక్ అధికారులకు పలుసూచనలు చేశారు. వన్ టైమ్ సెటిల్‌మెంట్ పద్ధతిలో రాజీ మార్గం ద్వారా కేసులను పరిష్కారం అయ్యేలా చొరవ తీసుకోవాలన్నారు. ఖాతాదారులకు లోక్ అదాలత్‌పై అవగాహన కల్పించాలని బ్యాంక్ అధికారులకు సూచించారు. రాజీ మార్గంలో కేసులను పరిష్కరించుకుంటే డబ్బులు, సమయం ఆదా అవుతుందన్నారు. కార్యక్రమంలో బార్ అసోసియేషన్ అధ్యక్షులు గోపాల్, వైస్ ప్రెసిడెంట్ మాణెన్న, బ్యాంక్ ప్రతినిధులు, లీగల్ సర్వీసెస్ సిబ్బంది, పారాలీగల్ వాలంటీర్లు పాల్గొన్నారు. ఫోటోరైటప్02. భూభారతి సదస్సులో ఆందోళన వ్యక్తం చేస్తున్న గ్రామస్థులు

## భూభారతిలో గందరగోళం..!
**-అధికారుల ఎదుట గ్రామస్థుల ఆందోళన**


భూభారతి సదస్సులో ఆందోళన వ్యక్తంచేస్తున్న గ్రామస్థులు

**అక్కన్నపేట, మే 15, ప్రభాతవార్త:**
తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా ప్రారంభించిన భూభారతి చట్టానికి అక్కన్నపేట మండలం పైలెట్‌గా ఎంపికైన విషయం తెలిసిందే. అయితే గురువారం మండలంలోని నందారం గ్రామంలో సంబంధిత అధికారులు భూభారతి సదస్సు ఏర్పాటు చేశారు. ఈ సదస్సుకు వచ్చిన అధికారులపై గ్రామస్థులు, రైతులు తిరుగుబాటు చేశారు. ప్రతిసారి గ్రామంలో ఏదో సదస్సులు నిర్వహించి అధికారులు వస్తూ, వెళ్తున్నారు తప్పితే, వారి సమస్యలను పరిష్కరించడం లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. గ్రామంలోని 932వ సర్వే నెంబర్‌లో అధికారుల తప్పిదాల వల్ల సీలింగ్ భూమిగా నమోదైందని, తాము సమస్యల పరిష్కారంకోసం ఎన్నో ఏళ్లుగా పోరాడుతున్నా మన్నారు. సమస్యలు పరిష్కరిస్తామని ఎన్నికలముందు హామీ ఇచ్చిన నాయకులుసైతం పదవులు పొంది సమస్యను గాలికివొదిలేస్తున్నారని మండిపడ్డారు. ఇప్పటికైనా అధికారులు తమ సమస్యను పరిష్కరించాలని లేనిపక్షంలో ఆమరణదీక్షకు దిగుతామని హెచ్చరించారు. ఆందోళన చేసినవారిలో కపూర్‌నాయక్‌తండా మాజీ సర్పంచ్ సంతోష్‌నాయక్, నందారం మాజీ సర్పంచ్ ఎల్లన్న, గ్రామ అభివృద్ధికమిటీ అధ్యక్షులు సంజీవ్, శ్రీనివాస్‌రెడ్డి, అనిల్‌తోపాటు తదితరులు ఉన్నారు.

## ఆర్‌ఆర్‌ఆర్ విస్తరణ పనులు వేగవంతం చేయాలి
**-జిల్లా కలెక్టర్ క్రాంతి వల్లూరు**


సమావేశంలో మాట్లాడుతున్న జిల్లాకలెక్టర్ క్రాంతి వల్లూరు

**సంగారెడ్డి బ్యూరో, మే 15, ప్రభాతవార్త:**
రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన రీజినల్ రింగ్ రోడ్ (ఆర్‌ఆర్‌ఆర్) విస్తరణ పనుల ప్రగతిని వేగవంతం చేయాలని జిల్లా కలెక్టర్ క్రాంతి వల్లూరు పేర్కొన్నారు. ఉమ్మడి మెదక్ జిల్లా పరిధిలో భూసేకరణకు సంబంధించిన అంశాలపై గురువారం కలెక్టరేట్‌లో మినీ సమావేశ మందిరంలో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా కలెక్టర్ మాట్లా డుతూ భూములు అందించిన రైతులకు వెంటనే పరిహారం అందించాలని, నష్టపరిహారం చెల్లింపుల్లో పారదర్శకత పాటించాలని, ప్రతి రైతుకు న్యాయం జరగాలని కలెక్టర్ అన్నారు. ప్రాజెక్టు ప్రాముఖ్యతపై ప్రజల్లో అవగాహన అవసరం అన్నారు. రైతుల నుండి స్వచ్ఛందంగా భూములు సేకరించేలా అవగాహన కల్పించాలన్నారు. భూములను అందించిన రైతులకు న్యాయం చేయాలన్నదే ప్రభుత్వ లక్ష్యమని కలెక్టర్ తెలిపారు. రైతుల భూమికి తగినంత నష్టపరిహారం చెల్లించేందుకు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. వాస్తవిక మార్కెట్ విలువ ఆధారంగా పరి హారము నిర్ణయించాలన్నారు. ఈసమావేశంలో రీజినల్ అధి కారి శివశంకర్, యాదాద్రి భువనగిరి జిల్లా అధికారులు, ఉమ్మడి జిల్లా అదనపు కలెక్టర్లు, ఆర్‌డిఓలు, సంబంధిత శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## ఎపిటోరియా నిర్మాణాలపై అదనపు కలెక్టర్ విచారణ

**నిబంధనలు పాటించని ఎపిటోరియాపై చర్యలు తీసుకోవాలి**
**గ్రామస్థుల ఫిర్యాదు**

**హత్నూర, మే 15, ప్రభాతవార్త:**
హత్నూర మండలం బోర్పట్ల గ్రామపరిధిలోని ఎపిటోరియా పరిశ్రమ నిబంధనలు కాలరాసి బరితెగించి నిర్మాణం పనులు చేపడుతుందని గురువారం విచారణకు వచ్చిన జిల్లా అదనపు కలెక్టర్ చంద్రశేఖర్‌కు గ్రామస్థులు పలువురు ఫిర్యాదు చేశారు. గ్రామపరిధిలోని ఎపిటోరియాపరిశ్రమ అనుమతులు లేకుండా నిర్మాణాలు చేపడుతుందని, నేరటికుంట శిఖంభూమిని ఆక్ర మించిందని ఇతర అంశాలతోకూడిన ఫిర్యాదును జిల్లా కలెక్టర్‌కు గ్రామస్థులు గతంలో ఫిర్యాదు చేశారు. ఫిర్యాదును పురస్కరించుకొని సంగారెడ్డిజిల్లా అదనపుకలెక్టర్ చంద్రశేఖర్, ఇరిగేషన్, పిసిబి, రెవెన్యూ, పంచాయతీరాజ్‌శాఖ అధికా రులతో కలిసి స్థలపరిశీలన చేశారు. ఈసందర్భంగా గ్రామ స్థులు పలువురు మాట్లాడుతూ నేరటికుంటను ఆక్రమించుకొని అక్రమ నిర్మాణాలు చేపట్టారని ఫిర్యాదు చేశారు. కొత్త బ్లాక్ లో ఎలాంటి అనుమతులు లేకుండా నిర్మాణ పనులు చేస్తున్నారని అదనపు కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. అదనపు కలెక్టర్ నేరటికుంటను, కొత్తగానిర్మించిన బ్లాక్‌ను పరిశీ లించారు. హెచ్‌ఎండిఏ అనుమతులు వచ్చేవరకు తదుపరి ఎలాంటి నిర్మాణాలు చేపట్టవదని అదనపుకలెక్టర్ చంద్రశేఖర్, పరిశ్రమవారిని ఆదేశించారు. నేరటికుంటను పూర్తిస్థాయిలో సర్వే చేసి నివేదిక అందించాలని ఇరిగేషన్ అధికారులను ఆదేశించారు. ఫుట్‌పాత్ సమస్యనుకూడా గ్రామస్థులు అదనపు కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లారు. చదువుకున్న స్థానిక నిరుద్యో గులకు, ఇవ్వకుండా, స్థానికేతరులకు ఉద్యోగాలు ఇస్తున్నారని గ్రామస్థులు పలువురు అదనపుకలెక్టర్ చంద్రశేఖర్‌కు ఫిర్యాదు చేశారు. ప్రభుత్వనిబంధనలు అతిక్రమిస్తున్న, యాజమాన్యం పై శాఖాపరమైన చర్యలు తీసుకోవాలని స్థానికులు ఈ సంద ర్భంగా అదనపుకలెక్టర్ చంద్రశేఖర్‌ను కోరారు. అదనపుకలెక్టర్ తోపాటు డిపిఓ సాయిబాబా, ఇరిగేషన్ ఎస్ఇ యేసయ్య, ఇఇ జైభీమ్, డిఈ రవికుమార్, ఎంపిడివో శంకర్ ఎంపిఓ యూసుఫ్, డిప్యూటీ తహసీల్దార్ దావూద్, తదితరులు పాల్గొన్నారు.


విచారణ జరుపుతున్న అదనపు కలెక్టర్ చంద్రశేఖర్

## స్వామివారి 48రోజుల హుండీ ఆదాయం లెక్కింపు


స్వామివారి హుండీ ఆదాయం లెక్కిస్తున్న దృశ్యం

**కొమురవెల్లి, మే 15, ప్రభాతవార్త:**
మండలకేంద్రంలోని శ్రీకొమురవెల్లి మల్లికార్జునస్వామి దేవా లయ 48 రోజుల హుండీ ఆదాయాన్ని గురువారం దేవాలయ ఆవరణలో లెక్కించారు. 48రోజుల హుండీ ఆదాయం నగదు రూ.90,09,170 రాగా, 096 మిశ్రమ బంగారం, 009కిలో 50గ్రాముల మిశ్రమ వెండి, విదేశీ కరెన్సీ 22నోట్లు, మిశ్రమ బియ్యం 14 క్వింటాళ్లు వచ్చినట్లు ఆలయ ఈవో అన్నపూర్ణ తెలిపారు. కార్యక్రమంలో ఆలయ అధికారులు విజయలక్ష్మీ, బుద్ది శ్రీనివాస్, ప్రధాన అర్చకులు మహాదేవుని మల్లికార్జున్, ధర్మకర్తలు కొప్పరపు జయప్రకాష్‌రెడ్డి, లింగంపల్లి శ్రీనివాస్, కాయిత మోహన్‌రెడ్డి, వలాద్రి అంజిరెడ్డి, పర్యవేక్షకులు సురేందర్, ఆలయ అర్చకులు, సిబ్బంది, స్వర్ణకారుడు నర్సిం హచారి, శివరామకృష్ణ భజనమండలి సేవ సభ్యులు తది తరులు పాల్గొన్నారు.

# చివరిగింజ వరకు ధాన్యం కొనుగోలు

**నర్సాపూర్ రూరల్, మే 15, ప్రభాతవార్త:**
రైతులుకష్టించి పండించినపంటను చివరిగింజ వరకు కొను గోలు చేస్తామని తహసీల్దార్ శ్రీనివాస్ అన్నారు. బుధవారం నర్సాపూర్ మండలంలోని రామచంద్రపురం ఐకెపి ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని మండల తహసీల్దార్ శ్రీనివాస్ పరిశీలించారు. ఈసందర్భంగా కొనుగోలు ప్రక్రియ, ధాన్యం రవాణా, ట్యాబ్ ఎంట్రీ, పుస్తక నిర్వహణ, రైతులకు సకాలం లో చెల్లింపులు, ధాన్యం అన్లోడింగ్ లాంటి విషయాలపై కేంద్ర నిర్వాహకులతో వాకబు చేసి సంతృప్తి చెందారు. అకాలవర్షాలకు రైతులు ఆందోళన చెందవద్దని చివరిగింజ వరకు కొంటామని రైతులకు హామీనిచ్చారు. కార్యక్రమంలో ఆర్ఐ సిద్ధిరాంరెడ్డి, ఎపిఎం మార్గం గౌరీశంకర్, సిసి దేవిసింగ్, సిఏ నీరజ రైతులు, హమాలీలు పాల్గొన్నారు.


ధాన్యం కొనుగోలు కేంద్రం పరిశీలిస్తున్న దృశ్యం

## 750 గ్రాముల అల్ప్రాజోలం పట్టివేత
**-పోలీసుల అదుపులో వ్యక్తి, కారు**
**-7లక్షల 50వేలు, సెల్ ఫోన్లు స్వాధీనం**


పోలీసుల అదుపులో నిషేధిత డ్రగ్స్‌ను తరలిస్తున్న కారు, వ్యక్తి దృశ్యం

**జహీరాబాద్, మే 15, ప్రభాతవార్త:**
మహారాష్ట్రలోని పూణే నుంచి నిషేధిత అల్ప్రాజోలం (డ్రగ్స్)ను తరలిస్తున్న వ్యక్తిని గురువారం జహీరాబాద్ పోలీసులు పట్టుకున్నారు. పూణే నుంచి జహీరాబాద్‌కు ఆర్టీసి బస్సులో మహారాష్ట్రలోని పూణే దౌండ్‌కు చెందిన విశ్వనాథ్ 750 గ్రాముల నిషేధిత అల్ప్రాజోలంను జహీరాబాద్ పట్టణానికి చెందిన మిద్దె స్వామిగౌడ్‌కు అమ్మడానికి వస్తున్న క్రమంలో బైపాస్ రోడ్డులోని ఇంద్రప్రస్థాన్ కాలనీ వద్ద అమ్మడానికి, కొనడానికి వచ్చిన ఇద్దరు వ్యక్తులను అదుపులోకి తీసుకున్నామన్నారు. అమ్మడానికి వచ్చిన వ్యక్తి నుంచి 750 గ్రాముల అల్ప్రాజోలంను, కొనడానికి వచ్చిన వ్యక్తి నుంచి 7లక్షల 50వేల రూపాయలను, క్రెటా కారును, ఇద్దరి వద్ద నుంచి సెల్ ఫోన్‌లను స్వాధీనం చేసుకున్నామన్నారు. ఈమేరకు కేసు నమోదుచేసి దర్యాప్తుచేస్తున్నట్లు పోలీసులు వివరించారు.

## ఇసుక నిల్వలు సీజ్...


డంప్ చేసిన ఇసుక దృశ్యం

**పాపన్నపేట, మే 15, ప్రభాతవార్త:**
మండల పరిధిలోని ఆరేపల్లిలో మంజీరానది నుండి అక్రమంగా రవాణా చేసి నిల్వ ఉంచిన ఇసుక కుప్పలను రెవెన్యూ అధికారులు గురువారం సీజ్ చేశారు. ఆర్ఐ నాగరాజు తెలిపిన వివరాలు...గ్రామ శివారులో ఉన్న మంజీరానది నుండి అక్రమంగా ఇసుక రవాణాచేసి గ్రామ సమీపంలో ఉన్న పంట పొలాల్లో ఇసుక కుప్పలను నిల్వ చేస్తున్నారు. సమాచారం రావడంతో ఆర్ఐ నాగరాజు సిబ్బందితో అక్కడికి చేరుకొని తనిఖీలు చేపట్టారు. పంట పొలాల వద్ద అక్రమంగా నిల్వ ఉంచిన సుమారు 12 కుప్పలలో 25 ట్రాక్టర్ల లోడ్ ఉన్న ఇసుకను సీజ్ చేశారు. తదుపరి చర్యలు తీసుకుంటామని ఆర్ఐ నాగరాజు పేర్కొన్నారు.

## శెట్టికుంటలో కూల్చివేతలు చేపట్టిన టౌన్‌ప్లానింగ్ అధికారులు


అనుమతులు లేని నిర్మాణాలను జెసిబితో కూల్చివేస్తున్న దృశ్యం

**అమీన్‌పూర్, మే 15, ప్రభాతవార్త:**
అమీన్‌పూర్ మున్సిపాలిటీ పరిధిలోని శెట్టి కుంటలో ఎలాంటి అనుమతులు లేకుండా నూతనంగానిర్మిస్తున్న ఇళ్లను టౌన్‌ప్లానింగ్ అధికారులు కూల్చివేశారు. గురువారం టౌన్ ప్లానింగ్ అధికారి పవన్ ఆధ్వర్యంలో పోలీసుల బందోబస్తు మధ్య శెట్టికుంటలో ఎలాంటి అనుమతులు లేకుండా నిర్మిస్తున్న పిల్లర్స్, స్లాబ్ లను జెసిబి సహాయంతో కూల్చివేయడం జరిగింది. ఈ సందర్భంగా టౌన్ ప్లానింగ్ అధికారి పవన్ మాట్లాడుతూ ఎలాంటి అనుమతులు లేకుండా నిర్మి స్తున్న పిల్లర్స్, స్లాబ్‌లను కూల్చి వేయడం జరిగిందని చెప్పుకొచ్చారు. గతంలో కూడా శెట్టికుంటలో కూల్చివేతలు చేపట్టామని తెలిపారు. చెరువుల్లో ఎలాంటి నిర్మాణాలు చేపట్టరాదని, నిర్మాణాలు చేపడితే చట్టపరమైన చర్యలు చేపడ తామని హెచ్చరించారు. ఇరిగేషన్ అధికారుల నుండి నో అబ్జెక్షన్ సర్టిఫికెట్ తీసుకొని మున్సిపాలిటీ అధికారుల నుండి అనుమతులు పొందిన తర్వాత నిర్మాణాలు చేపట్టాలని తెలిపారు.

## భక్తులతో కోలాహలంగా నల్లపోచమ్మ ఆలయం



బోరంచ నల్లపోచమ్మను దర్శించుకుంటున్న భక్తులు

**మనూర్, మే 15, ప్రభాతవార్త:** మండల పరిధిలోని బోరంచ గ్రామంలోని నల్లపోచమ్మ ఆలయ 7వారాల జాతర ఉత్సవాల్లో భాగంగా 3వ వారమైన గురువారం జాతరలో భక్తుల కోలాహలం నెలకొంది. జాతర ఉత్సవాలకు ఆయా ప్రాంతాల నుంచి ఉమ్మడి మెదక్ జిల్లాతోపాటు కర్నాటక, మహారాష్ట్ర ప్రాంతాలనుంచి భక్తులు పెద్దసంఖ్యలో చేరుకుని ఆలయంలో అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజాకార్యక్రమాలు నిర్వహించారు. ఆలయ అర్చకులు శ్రీకాంత్‌స్వామి, సిద్ధుస్వామి, నాగయ్య, ప్రవీణ్‌స్వామిలు వేదమంత్రాలు వల్లిస్తుండగా భక్తులు ప్రత్యేకపూజా కార్యక్రమాలు నిర్వహించారు. ఆలయ పరిసరాల్లో ఎస్ఐ శంకర్రావు తనసిబ్బందితో బందోబస్తును నిర్వహించారు. కార్యక్రమంలో శ్రీకాంత్‌రెడ్డి, రమేష్‌రెడ్డి, శేఖర్, భక్తులు పాల్గొన్నారు.

## గుంతలమయమైన రోడ్డు-వర్షం పడితే తప్పని పాట్లు



కిషన్‌నాయక్ తండా రోడ్లపై నిలిచిన వర్షపునీటి దృశ్యం

**సిర్గాపూర్, మే 15, ప్రభాతవార్త:** మండల కేంద్రమైన సిర్గాపూర్‌తో పాటు మండలంలోని ఆయా గ్రామాల్లో కురిసిన భారీ వర్షానికి రోడ్లన్నీ చిత్తడిగా మారిపోయిం. మండలంలోని దాదాపు అన్నిరోడ్లు గుంతలమయంగా మారిపోయాయి. మండలంలోని ఉజలంపాడ్, వాసర్, వంగ్దాల్, కిషన్‌నాయక్ తండా, పొట్పల్లి గ్రామాల్లో బుధవారం ఉదయం కురిసిన భారీవర్షానికి రైతులు సాగుచేస్తున్న పంటలు నీటిపాలయ్యాయి. భారీగా వర్షానికి రోడ్లు చిత్తడిగా మారడంతోపాటు పిల్ల కాలువలు, వాగులు, వంకల్లో నీరు నిలిచింది. రోడ్లపై నీరు నిలిచి పోవడంతో అటు వాహనాలపై, కాలినడకతోను ప్రయాణం చేసేందుకు ప్రజలు ఇబ్బందులు పడాల్సి వచ్చింది.

## వనదుర్గమ్మను దర్శించుకున్న నర్సాపూర్ ఎమ్మెల్యే



వనదుర్గమ్మను దర్శించుకుంటున్న నర్సాపూర్ ఎమ్మెల్యే సునీతాలక్ష్మారెడ్డి

**పాపన్నపేట, మే 15, ప్రభాతవార్త:** పవిత్ర పుణ్యక్షేత్రమైన ఏడుపాయల వనదుర్గాభవానీమాతను నర్సాపూర్ ఎమ్మెల్యే సునీతాలక్ష్మారెడ్డి గురువారం దర్శించుకుని ప్రత్యేకపూజలు నిర్వహించారు. ఎమ్మెల్యేకు ఆలయసిబ్బంది ఆలయమర్యాదల ప్రకారం పూర్ణ కుంభంతో స్వాగతం పలికారు. ఈ సందర్భంగా ఆలయ పండితులు ఆమె పేర ప్రత్యేక అర్చనలు నిర్వహించి తీర్థప్రసాదములు అందజేశారు.

## గురుకులాల ఇంటర్‌లో ప్రవేశాలకు కౌన్సిలింగ్

**నాగల్‌గిద్ద, మే 15, ప్రభాతవార్త:** మండల పరిధిలోని కరస్‌గుత్తి గిరిజన బాలికల గురుకుల కళాశాలలో ఇంటర్‌లో ప్రథమ సంవత్సరంలో విద్యను అందుకునేందుకు ఈ నెల 15, 16వ తేదీలలో రంగారెడ్డిజిల్లా హయత్‌నగర్‌లో నిర్వహిస్తున్న కౌన్సిలింగ్‌కు విద్యార్థులు హాజరుకావాలని కళాశాల ప్రిన్సిపాల్ ఇంద్రజ పేర్కొన్నారు. హయత్‌నగర్‌లోని ప్రతిభ, కల్వంచలోని శాంతినగర్ భాగ్యలత కళాశాలల్లో ఉదయం 10గంటలకు కౌన్సిలింగ్ నిర్వహిస్తారన్నారు.

## 17న జహీరాబాద్‌లో జాబ్ మేళా

**జహీరాబాద్, మే 15, ప్రభాతవార్త:** ఈ నెల 17వ తారీఖున సెట్విన్ శిక్షణాసంస్థ, పుష్కల అగ్రోటెక్ లిమిటెడ్‌ల ఆధ్వర్యంలో పట్టణంలోని శిక్షణాసంస్థ నందు జాబ్‌మేళాను నిర్వహిస్తున్నట్లు సెట్విన్ శిక్షణాసంస్థ, పుష్కల అగ్రోటెక్ లిమిటెడ్ బాధ్యులు సంయుక్త ప్రకటనలో పేర్కొన్నారు. సెట్విన్ సంస్థ అధికారులు ఇస్మాయిల్, భరత్, పుష్కల అగ్రోటెక్ లిమిటెడ్ చంద్ర ఆర్ఎస్ఎం, బిటి రామానాయుడు, కిరణ్‌కుమార్‌ల ఆధ్వర్యంలో జాబ్‌మేళాను నిర్వహిస్తామన్నారు. పట్టణంలో పుష్కల అగ్రోటెక్ లిమిటెడ్ నూతనంగా ఏర్పాటు చేసిన అగ్రికల్చర్ స్టోర్‌లో విధులు నిర్వహించేందుకు డిగ్రీ, బిఎస్సీ అగ్రికల్చర్ డిప్లొమా అర్హత కలిగిన నిరుద్యోగులు జాబ్‌మేళాను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

## అకాల వర్షం...ఇబ్బందులు పడ్డ రైతాంగం..

**పాపన్నపేట, మే 15, ప్రభాతవార్త:** మండల పరిధిలోని ఆయా గ్రామాల్లో గురువారం తెల్లవారుజామున ఉరుములు, మెరుపులతో కూడిన వర్షం కురిసింది. కొనుగోలుకేంద్రాల వద్ద ధాన్యం కుప్పల మధ్య వర్షం నీరు చేరింది. ధాన్యం కుప్పలపై టార్పాలిన్లు కప్పి ఉంచడంతో ధాన్యం కొంతమేర తడిసింది. నీటిని తొలగించేందుకు రైతులు ఇబ్బందులు పడ్డారు. వర్షంతో విద్యుత్ సరఫరాలో తరచూ అంతరాయం కలిగింది.

## పకడ్బందీగా ధాన్యం కొనుగోలు



ధాన్యం కొనుగోలు చేస్తున్న దృశ్యం

**పెద్దశంకరంపేట, మే 15, ప్రభాతవార్త:** జిల్లా వ్యాప్తంగా పిఏసిఎస్ ఆధ్వర్యంలో ధాన్యం కొనుగోలు పకడ్బందీగా చేపడుతున్నట్లు జిల్లా సహకార ఆడిట్ అధికారి కరుణాకర్ అన్నారు. గురువారం పెద్దశంకరంపేట మండలంలో నిర్వహిస్తున్న జొన్న, ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఆయన పరిశీలించారు. ధాన్యం కొనుగోలు, తరలింపులో రైతులకు ఇబ్బందులు లేకుండా చూడాలని పిఏసిఎస్ సిఈఓ రవీందర్‌కు సూచించారు. కార్యక్రమంలో ఆయనవెంట తహసీల్దార్ శ్రీనివాస్ తదితరులున్నారు.

# గోనె సంచులు కరువాయే-లారీలు రాకపాయే

**-ఆగిపోయిన జొన్నల కొనుగోలు**
**-అన్నదాతలకు తప్పని అవస్థలు**



తడ్కల్‌లో జొన్నల కొనుగోలు ఆగిపోవడంతో కుప్పలుగా మారిన జొన్నల దృశ్యం

**కంగ్టి, మే 15, ప్రభాతవార్త:** పంటల సాగులో పడరాని పాట్లు పడి పంటలను పండిస్తే ధాన్యం అమ్ముకుని అప్పులు తీర్చుకుందామంటే కొనేవారు లేక అన్నదాతల పరిస్థితి అగమ్యగోచరంగా మారింది. వ్యవసాయభూమిలో విత్తనాలు నాటిన దగ్గర నుంచి పంట చేతికొచ్చే వరకు పడ్డ కష్టాలు ఒక ఎత్తయితే కొనుగోలు కేంద్రానికి జొన్నలను తరలించినా కొనేవారులేక రైతుల పరిస్థితి దయనీయంగా మారింది. ఇందుకు సంబంధించి పూర్తి వివరాల్లోకి వెళితే, మండల పరిధిలోని తడ్కల్‌లో కంగ్టి సొసైటీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన జొన్నల కొనుగోలు కేంద్రంలో కాంట (తూకం చేసే) లేక, గన్నీ బ్యాగులు అందుబాటులో లేకపోవడం ఒక ఎత్తయితే కొనుగోలు కేంద్రం నుంచి జొన్నలను తరలించే లారీలు లేక పోవడం మరో ఎత్తు. నాలుగురోజుల క్రితం రైతులు ఆరుగాలం కష్టించి పండించిన జొన్నలను కొనుగోలు కేంద్రానికి తీసుకువచ్చినా, కొనే అవకాశం లేక రైతులు కేంద్రం వద్ద పడిగాపులు కాయాల్సిన దయనీయ స్థితిని ఎదుర్కొంటున్నారు. గత మూడురోజుల క్రితం చినుకులు పడటంతో రైతులు జొన్నలు నానిపోకుండా ఉండేందుకు రైతులు పడ్డ అవస్థలు అన్నీ ఇన్నీ కావు. గ్రామంలో ఏర్పాటు చేసిన జొన్నల కొనుగోలు కేంద్రంలో రైతులు నుంచి సుమారుగా 7వేల క్వింటాళ్ల జొన్నలు కొనుగోలు చేశారు. గన్నీ బ్యాగులు లేకపోవడంతో కేంద్రం పరిసరాల్లో 2వందల నుంచి 3వందల క్వింటాళ్ల జొన్నలు ఆరుబయట కుప్పలుగా పడి ఉన్నాయి. గతంలో కొనుగోలు చేసిన జొన్నలను కేంద్రంనుంచి తరలించేందుకు లారీలు అందుబాటులోలేక పాఠశాలలో ఏర్పాటుచేసిన కొనుగోలు కేంద్రంలోనే జొన్నలు ఉండిపోయాయి. సంబంధిత అధికారులు, పాలకులు స్పందించి రైతులకు అవసరం మేరకు గన్నీ బ్యాగులు సరఫరా చేసి కేంద్రం నుంచి జొన్నలను తరలించేందుకు లారీలను ఏర్పాటు చేయాలని రైతులు డిమాండ్ చేస్తున్నారు.

# లారీలు రాక కేంద్రాల్లో నిలిచిపోయిన ధాన్యం

**-అధ్వానంగా ధాన్యం కొనుగోళ్లు**
**-పట్టించుకోవాలని మాజీ ఎమ్మెల్యే సూచన**



వర్షానికి తడిసిపోయిన ధాన్యాన్ని పరిశీలిస్తున్న మాజీ ఎమ్మెల్యే చంటి క్రాంతికిరణ్

**చౌటకూరు, మే 15, ప్రభాతవార్త:** మండలంలోని ఆయా గ్రామాల్లో నిర్వహిస్తున్న వరి కొనుగోలు కేంద్రాల పరిస్థితి అస్తవ్యస్తంగా అధ్వాన్నంగా మారిందని మాజీ ఎమ్మెల్యే చంటి క్రాంతికిరణ్ మండిపడ్డారు. మండలంలోని చక్రియాల్‌లో బుధవారంరాత్రి కురిసిన వర్షానికి కొనుగోలు కేంద్రాలవద్ద తడిసిపోయిన ధాన్యంను గురువారం మాజీఎమ్మెల్యే చంటి క్రాంతికిరణ్ అందోలు బిఆర్ఎస్ నేత పట్లోళ్ల జైపాల్‌రెడ్డితో కలిసి పరిశీలించారు. ఈసందర్భంగా ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో మాజీ ఎమ్మెల్యే క్రాంతికిరణ్ మాజీ ఎంపిపి ఉపాధ్యక్షులు గాజుల వీరేందర్, ఉమ్మడి పుల్‌కల్ మండల సర్పంచుల ఫోరం మాజీ బక్కారెడ్డి, కిష్టారెడ్డి, మండల బిఆర్ఎస్ అధ్యక్షులు చౌకంపల్లి శివకుమార్, నాయకులు తెంగె అనంతయ్య, తెంగె మల్లేశం, డాకూరు అర్జునయ్య, ఆర్ మల్లేశం, కొత్తగొలన రవిలతో కలిసి మాట్లాడుతూ కొనుగోలు కేంద్రాల్లో కొనుగోలు మందకొడిగా సాగుతుండటంతో రైతులు అవస్థలు పడాల్సి వస్తోందని ఆగ్రహం వ్యక్తంచేశారు. అధికారులు మొద్దు నిద్ర వీడి తూకం చేసిన ధాన్యాన్ని ఎప్పటికి అప్పుడు రైసు మిల్లులకు పంపేలా చూడాలని సూచించారు. నియోజకవర్గంలోని పుల్‌కల్, చౌటకూరు, టేక్మాల్, అందోలు తదితర మండలాల్లో ఏర్పాటుచేసిన వరి ధాన్యం కొనుగోలు కేంద్రాలపై అధికారుల మానిటరింగ్ లేక అన్నదాతలు అవస్థలకు గురికావాల్సి వస్తుందని ఆగ్రహం వ్యక్తం చేశారు. తూకం వేసిన ధాన్యం సైతం వర్షానికి తడిసిపోవడం చూస్తుంటే అధికారుల పనితీరు బహిర్గతం అవుతోందని విచారం వ్యక్తంచేశారు. బిఆర్ఎస్‌హయాంలో అన్నదాతలు ఆగమయ్యే పరిస్థితి లేకుండే అని గుర్తుచేశారు. వాతావరణ శాఖ వర్షాలపై హెచ్చరిస్తున్నా అన్నదాతలను ఆదుకునేందుకు ప్రభుత్వం ముందస్తుగా జాగ్రతలు తీసుకోకపోవడం విడ్డూరంగా ఉందని ఆవేదన వ్యక్తం చేశారు. సింగూరు ఎడమ కాలువకు సాగు నీరు విడుదల చేయకపోవడంతో ఖరీఫ్, యాసంగి సీజన్లలో క్రాప్‌హాలిడే ప్రకటించడంతో పంటల దిగుబడులు లేక రైతులు కుదేలవుతున్నారన్నారు. సింగూరుప్రాజెక్టులో నీరు సమృద్ధిగా ఉన్నా సాగునీరు విడుదల చేయకపోవడం ఏమిటని ప్రశ్నించారు. మంత్రి దామోదర్ రాజనర్సింహా ధాన్యం సేకరణపై సమీక్షించాలని డిమాండ్ చేశారు. ధాన్యం తడిసిపోయినా కాంగ్రెస్ వారికి కానరావడం లేదు అని, ఒక్కరయినా వచ్చి రైతులను పరామర్శించారా అని నిలదీశారు. రైతులకు అండగా బిఆర్ఎస్ ఉంటుందని క్రాంతికిరణ్ భరోసా ఇచ్చారు.

## ఆర్థిక సహాయం సరే... ముందు కార్యకర్తలను పట్టించుకోండి...

**-సీనియర్ టిఆర్ఎస్ కార్యకర్త, ఉద్యమకారుడు భూమ మల్లేశం ఆవేదన**

**రామాయంపేట, మే 15, ప్రభాతవార్త:** గ్రామాల్లో ఉన్న ఉద్యమకారులను, కార్యకర్తలను ముందుగా పట్టించుకోండి, వారి బాగోగుల గురించి తెలుసుకోండి. ఆతర్వాత గుడిలోకి వెళ్లడం.. అకస్మాత్తుగా ప్రమాదాలు జరిగిన వారి కుటుంబాలను పరామర్శించడం చేయాలని ఉద్యమకారుడు, రామాయంపేట పట్టణానికి చెందిన టిఆర్ఎస్ సీనియర్ కార్యకర్త భూమ మల్లేశం ఆపార్టీ నాయకుడికి సూచించారు. ఈ మేరకు ఆయన తన ఆవేదనను వెళ్లగక్కుతూ ఆనాయకుడిని ఉద్దేశించి సోషల్ మీడియాలో పెట్టిన పోస్ట్‌వైరల్‌గా మారింది. ఇలాంటి కార్యక్రమాలు ఎన్నో చేస్తున్నారు కాని, ఏ ఊర్లో మనకుసంబంధించిన పార్టీ కార్యకర్తలు, ముఖ్య నాయకులు ఉన్నారో తెలుసా? అని ఆయన ప్రశ్నించారు. కనీసం కార్యకర్తలను నెలకు ఒక్కసారైనా ఫోన్‌చేసి పలకరించినరోజులు ఉన్నాయా? దయచేసి మీ స్వార్థాలకు మా కార్యకర్తలను బలి చేయకండి. అంటూ పోస్ట్ చేశారు. ఎందుకంటే గత తెలంగాణ ఉద్యమం నుంచి కూడా మేం పని చేస్తూనే పనిమనుషుల లాగే ఉన్నాం. మేము గల్లీలో పనిచేస్తూ, మీకు పని చేస్తున్నాము. కనీసం కార్యకర్తలు ఎవరు? కార్యకర్తలకు ఎవరైనా ఫోన్‌చేసి తెలుసుకున్నారా? కార్యకర్తల ఆవేదన పట్టించుకోరా? అంటూ తెలిపారు. ఆర్థిక సహాయం చేయడానికి ముందు మా బాగోగులు కూడా తెలుసుకోండి అంటూ మల్లేశం పోస్ట్ చేశారు.

## సిఎం సహాయనిధి ఆపదలో ఉన్నవారికి ఒక వరం

**-కాంగ్రెస్‌పార్టీ ఇంచార్జి చెరుకు శ్రీనివాస్‌రెడ్డి**

**దుబ్బాక, (అక్బర్‌పేట భూంపల్లి), మే 15, ప్రభాతవార్త:** సిఎం సహాయనిధి ఆపదలో ఉన్నవారికి ఒకవరం అని కాంగ్రెస్‌పార్టీ ఇంచార్జి చెరుకు శ్రీనివాస్‌రెడ్డి తెలిపారు. బుధవారం దుబ్బాక పట్టణపరిధిలోని క్యాంప్‌కార్యాలయంలో వివిధగ్రామాలకు చెందిన బాధిత కుటుంబాలకు సిఎం సహాయనిధి చెక్కులను అందించారు. చిట్టాపూర్‌గ్రామానికి చెందిన ధుంపేట దేవవ్వకు రూ.53,500 చెక్కును అందించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ సీనియర్ నాయకులు సోలిపేటప్రసాద్ రెడ్డి, చిట్టాపూర్ గ్రామ కమిటీ అధ్యక్షులు రెడ్డి బాల్ నరసింహులు, ఉపాధ్యక్షులు సిద్దని రాజు, సోషల్ మీడియా కోఆర్డినేటర్ గాజుల రమేష్, నాయకులు గాజుల నరేందర్, మహిళ అధ్యక్షురాలు నగరం లక్ష్మీనర్సవ్వ, మండల బ్లాక్‌కాంగ్రెస్ అధ్యక్షుడు పాతూరి వెంకటస్వామిగౌడ్, కాంగ్రెస్‌పార్టీ నాయకులు పాల్గొన్నారు.

## డిపో అభివృద్ధికి కార్మికులు కష్టపడి పనిచేయాలి

**-జిల్లా గ్రంథాలయ చైర్మెన్ కేడం లింగమూర్తి**



నూతన బస్సును ప్రారంభిస్తున్న దృశ్యం

**హుస్నాబాద్ రూరల్, మే 15, ప్రభాతవార్త:** హుస్నాబాద్ బస్‌డిపో అభివృద్ధికి కార్మికులంతా కలిసి కష్టపడి పని చేయాలని జిల్లా గ్రంథాలయచైర్మన్ కేడం లింగమూర్తి అన్నారు. గురువారం హుస్నాబాద్ బస్టాండ్‌లో హుస్నాబాద్‌నుండి యాదగిరిగుట్టకు నూతన ఆర్టీసీ బస్సు(ఎక్స్‌ప్రెస్) సర్వీస్‌ను డిపో మేనేజరు వెంకన్నతో కలిసి ప్రారంభించారు. అనంతరం ప్రారంభించిన బస్సులోనే కొద్దిదూరం ప్రయాణంచేశారు. హుస్నాబాద్ డిపో అభివృద్ధి కోసం స్థానిక ఎమ్మెల్యే, రాష్ట్ర రవాణా, బిసి సంక్షేమశాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ ప్రత్యేక దృష్టి సారించారన్నారు. కార్యక్రమంలో సింగిల్ విండో చైర్మన్ బొలిశెట్టి శివయ్య, మార్కెట్ కమిటీ చైర్మెన్ కంది తిరుపతిరెడ్డి, సీనియర్ నాయకులు చిత్తారి రవిందర్, పద్మ, వెన్న రాజు, భూక్య సరోజ, పచ్చిమట్ల శ్రీకాంత్, కేశవేని రమేష్‌తోపాటు ఉన్నారు.

## చిల్వేర్‌లో రేణుక ఎల్లమ్మకు బోనాల ఊరేగింపు

**అల్లాదుర్గం, మే 15, ప్రభాతవార్త:** మండల పరిధిలోని చిల్వేర్‌లో గురువారం సాయంత్రం రేణుక ఎల్లమ్మ తల్లికి బోనాలపండగ గౌడసంఘం ఆధ్వర్యంలో భక్తిశ్రద్ధలతో ఘనంగా నిర్వహించారు. గ్రామంలోని ఇళ్లనుంచి బోనాలను తలపైధరించి గ్రామ కూడలిలోకి చేరుకుని సామూహికంగా ఎల్లమ్మ మాతకు గోవింద నామస్మరణతో గొల్ల బీరుల డోలు చప్పుళ్ల మధ్య, యువకులు కేరింతలు, నృత్యాలు చేస్తుండగా ఆలయానికి బోనాలను ఊరేగింపుగా తీసుకువచ్చి ఆలయం చుట్టూ ప్రదక్షిణలు వేసి అమ్మవారికి బోనాలను సమర్పించారు.

# వారాంతపు సంతతో ముందుకు సాగని వాహనాలు

**-రోడ్డు జామ్‌తో ఇబ్బందులు పడుతున్న జనాలు**



కంగ్టిలో వారంతపు సంతతో ఆగిపోయిన వాహనాల దృశ్యం

**కంగ్టి, మే 15, ప్రభాతవార్త:** మండల కేంద్రమైన కంగ్టిలో ప్రతి బుధవారం నిర్వహించే వారాంతపు సంతతో అటుగా వచ్చే వాహనాలు ఎక్కడివి అక్కడే ఆగిపోవడంతో సంతకు వచ్చిన జనాలు ఇబ్బందులకు గురవుతున్నారు. కంగ్టిలోని సుభాష్‌చంద్రబోస్ కూడలి వద్ద నుంచి పిట్లం ఔరాద్, బింరా, దెగుల్‌వాడి, నారాయణ ఖేడ్ తదితర పట్టణాలకు వెళ్లేందుకు 4రోడ్లు ఉన్నాయి. ఈరోడ్ల గుండానే ఆయా పట్టణాలకు వెళ్లాల్సి ఉండటంతో ప్రతి బుధవారం నిర్వహించే సంతను వన్‌వే మీద నిర్వహిస్తూ వస్తున్నారు. ఆయా పట్టణాలకు ఈ చౌరస్తా నుంచే నిత్యం వందల సంఖ్యలో వాహనాలు రాకపోకలు సాగిస్తూ ఉంటాయి. తొందరగా వెళ్లాలని వాహన చోదకులు ముందుకు పోయే అవకాశం లేక తమ వాహనంతో హారన్‌లు కొడుతూ ప్రజలను ఇబ్బందులకు గురిచేస్తూ వస్తున్నారు. సంతలో సరుకులు కొనుగోలు చేసుకుని ఇంటికి వెళదామంటే వాహనాలు ఎక్కడివి అక్కడే ఆగిపోవడం, వాహనాల హారన్ శబ్దాలతో చెవులు గుయ్యిమంటుండటంతో ప్రజలు తమ చెవులను మూసుకుని ముందుకు సాగలేక పడుతున్న పాట్లు చెప్పనలవిగా కాకుండా ఉన్నాయని ప్రత్యేకంగా చెప్పాల్సిన పనిలేదు. ప్రజలు, వాహనదారులు పడుతున్న పాట్లను పసిగట్టిన ఎస్ఐ విజయ్‌కుమార్ చొరవ తీసుకుని సంతను సిద్దేశ్వర రోడ్డుకు మార్చారు. సిద్దేశ్వర రోడ్డులో 4 వారాలుపాటు సంతసాగించి తిరిగి ప్రధాన రోడ్డు పైకి సంతను మార్చారు. సంతను ఇతర ప్రాంతానికి మార్చి వాహన చోదకులకు, ఆయా గ్రామాల నుంచి సంతకు వచ్చే ప్రజల కష్టాలు దూరం అయ్యేలా చర్యలు తీసుకోవాలని మండల ప్రజలు డిమాండ్ చేస్తున్నారు.

## విగ్రహప్రతిష్ఠలో ఎంజిఆర్ ఫౌండేషన్ చైర్మన్

**నిజాంపేట, మే 15, ప్రభాతవార్త:** నిజాంపేట్ మండల్ మట్టాన్కుంట తండాలో నూతనంగా నిర్మించిన శ్రీసంత్ సేవాలాల్‌మహారాజ్ భవానీమాత మందిరంలో విగ్రహప్రతిష్ఠ కార్యక్రమంలో పాల్గొని తీర్థప్రసాదాలను స్వీకరించిన ఎంజిఆర్ ఫౌండేషన్ చైర్మన్ గుజ్జపు మచ్చేందర్ వారితోపాటు కృష్ణాపూర్ మాజీసర్పంచ్ కిష్టారెడ్డి, సీనియర్ నాయకులు కారేగామ నాగిరెడ్డి, రాములునాయక్ శంకర్, రాంసింగ్, డీలర్ గణపతి, హరిసింగ్, బన్సిలాల్, సర్దాం, రమేష్, నవీన్, ప్రేంసింగ్, మోహనలాల్, అభి, పవర్, రాంచరణ్, విజయ్, కళ్యాణ్, కాశీరాం, రాజు, విజయ్, రాజేష్‌లు ఉన్నారు.

## కెసిఆర్ కాలనీ సమస్యలపై నిరంతరం కృషి..

**-పిసిసి కార్యదర్శి చౌదరి సుప్రభాతరావు**

**వార్త ప్రభావం**



కాలనీవాసుల సమస్యలు అడిగి తెలుసుకుంటున్న సుప్రభాత్‌రావు

**రామాయంపేట, మే 15, ప్రభాతవార్త:** రామయంపేట మున్సిపాలిటీ పరిధిలోనీ కెసిఆర్ కాలనీ డబుల్ బెడ్ రూమ్‌లోని సమస్యలపై నిరంతరం కృషి ఉంటుందని పిసిసి కార్యదర్శి చౌదరి సుప్రభాతరావ్ పేర్కొన్నారు. గురువారం వార్త జాతీయ తెలుగు పత్రికలో కెసిఆర్ కాలనీలో డ్రైనేజీ వ్యవస్థ అస్తవ్యస్తం అన్న శీర్షికతో వచ్చిన కథనానికి ఆయనతోపాటు అధికారులు స్పందించారు. విషయం తెలుసుకొని కాలనీకి విచ్చేసిన ఆయన కాలనీ అంతా తిరిగి కాలనీవాసులతో సమస్యలపై వివరాలు అడిగితెలుసుకున్నారు. కాలనీలో పొంగి పొర్లుతున్నడ్రైనేజీలను బాగుచేయిస్తానని ఎమ్మెల్యే రోహిత్‌రావుతో మాట్లాడి కాలనీలో ఉన్నసమస్యలు ప్రధానంగా మురికికాలువలు, ఇంటర్నల్ రోడ్స్ వేయిస్తానని తెలిపారు. మున్సిపల్‌మేనేజర్ శ్రీనివాస్ మాట్లాడుతూ కెసిఆర్ కాలనీలో సమస్యల నివారణకు చర్యలు తీసుకుంటామని తెలిపారు. డ్రైనేజీవ్యవస్థ మెరుగుపరుస్తామని తెలిపారు. కార్యక్రమంలో మున్సిపల్ వర్క్ ఇన్స్పెక్టర్ శ్రీనివాస్, కెసిఆర్ కాలనీవాసులు డిజి శ్రీనివాసశర్మ, కట్ట ప్రభాకర్, ఎల్లా గౌడ్, తుంగల వెంకటి నరసింహులు తదితరులు ఉన్నారు.

## శ్రీవేంకటేశ్వరస్వామి దేవాలయ ఉత్సవాలు



వేంకటేశ్వరస్వామి ఉత్సవాల కరపత్రం ఆవిష్కరిస్తున్న దృశ్యం

**సిద్దిపేట అర్బన్, మే 15, ప్రభాతవార్త:** సిద్దిపేట జిల్లా కేంద్రంలోని మోహినీపుర శ్రీపద్మావతిసమేత వేంకటేశ్వరస్వామి దేవాలయ స్వర్ణోత్సవ, బ్రహ్మోత్సవాలను ఈనెల 17నుంచి 23 వరకు అంగరంగవైభవంగా నిర్వహించడానికి తగు ఏర్పాట్లుచేస్తున్నట్లు ఆలయ వ్యవస్థాపక ప్రతినిధులు టివి.అమరేష్‌విష్ణు, ఈవో విశ్వనాథం, ఆలయడైరెక్టర్ దాస శ్రీనివాస్‌లు తెలిపారు. గురువారం ఆలయ ఆవరణలో ఏర్పాటుచేసిన విలేకరులసమావేశంలో మాట్లాడారు. శ్రీత్రిదండి అహోబల రామానుజ జీయర్‌స్వామి, శ్రీత్రిదండి దేవనాథ రామానుజ జీయర్‌స్వామి పర్యవేక్షణలో ఉత్సవాలు నిర్వహించడం జరుగుతుందన్నారు. ఈనెల 17న వైశాఖ బహుళ పంచమి ఉదయం ఉత్సవారంభ స్నపనంతో స్వర్ణోత్సవ, బ్రహ్మోత్సవాలు ప్రారంభించడం జరుగుతుందన్నారు. 18న ఉదయం 8.30 సాయంత్రం 7గంటల వరకు వివిధ పూజాకార్యక్రమాలు నిర్వహించడం జరుగుతుందన్నారు. 19న ఉదయం 9.30కి ప్రారంభమయ్యే పూజాకార్యక్రమంలో భద్రాచల దేవస్థాన స్థానాచార్య కె.ఇ.స్థలశాయి ఆచార్యస్వామిపాల్గొంటారనితెలిపారు.సాయంత్రం 8గంటలకు ఎదుర్కోలు ఉత్సవం నిర్వహించడం జరుగుతుందన్నారు. 20 ఉదయం 8.30కి చిన్నజీయర్‌స్వామి సన్నిధిలో తీర్థగోష్ఠి, 10.30కి శ్రీత్రిదండి చిన్న శ్రీమన్నారాయణ రామానుజ జీయర్‌స్వామి పర్యవేక్షణలో శ్రీభూనీళాసమేత శ్రీనివాస కళ్యాణమహోత్సవం నిర్వహించడం జరుగుతుందన్నారు. 21న శ్రీవారిరథోత్సవం, 22న పలుపూజాకార్యక్రమాలు నిర్వహించడం జరుగుతుందన్నారు. 23న అష్టోత్తర శత ఘటాభిషేకంతో ఉత్సవాలు ముగుస్తాయన్నారు. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా తగు ఏర్పాట్లు చేస్తున్నట్లు తెలిపారు. ఉత్సవాలలో మంత్రులు సురేఖ, ప్రభాకర‌గౌడ్‌తోపాటు ఎమ్మెల్యే హరీష్‌రావు తదితరులు పాల్గొంటారని వివరించారు. దాతలసహకారంతో ఉత్సవాల సందర్భంగా ప్రతినిత్యం అన్నదానం జరుగుతుందన్నారు. స్వామివారి స్వర్ణోత్సవ, బ్రహ్మోత్సవాలలో భక్తులు అధికసంఖ్యలో పాల్గొని స్వామివారి కృపకు పాత్రులు కావాలని కోరారు. సమావేశంలో ఆలయ కమిటీ డైరెక్టర్లు బాలకృష్ణ, పండరి, మనోహర్‌రెడ్డి, గోపి, రమా, నాగమణి, శ్రీనివాస్, నవీన్, బాలరాజు తదితరులు పాల్గొన్నారు.

## ఎంపిని కలుసుకున్న మిషన్ భగీరథ డిఈ



ఎంపి, మాజీమంత్రిని కలుసుకున్న మిషన్‌భగీరథ డిఈ సృజన్‌కుమార్

**జహీరాబాద్, మే 15, ప్రభాతవార్త:** మిషన్ భగీరథ వాటర్ సప్లై డిపార్ట్మెంట్ జహీరాబాద్ డివిజన్ డిఈగా బాధ్యతలు స్వీకరించిన జి.సృజన్‌చక్రవర్తి గురువారం ఎంపి సురేష్ కుమార్‌శెట్కార్, మాజీమంత్రి నియోజకవర్గ కాంగ్రెస్‌పార్టీ ఇంచార్జి డాక్టర్ చంద్రశేఖర్‌లను మర్యాదపూర్వకంగా కలుసుకున్నారు. ప్రజలకు తాగునీటి ఇబ్బందులు కల్గకుండా చూడాలని డిఈ సృజన్‌చక్రవర్తికి ఎంపి, మాజీ మంత్రులు సూచించారు.

## ధాన్యాన్ని త్వరగా మిల్లులకు తరలించాలి



కొనుగోలు కేంద్రాన్ని పరిశీలిస్తున్న తహసీల్దార్ మన్నన్

**చిన్నశంకరంపేట, మే 15, ప్రభాతవార్త:** ధాన్యం కొనుగోలుచేసిన వెంటనే కేంద్రాల్లో నిల్వచేయకుండా సంబంధిత మిల్లర్లకు వెంటనే తరలించాలని తహసీల్దార్ మన్నన్ సూచించారు. గురువారం మండలపరిధి ఎస్.కొండాపూర్,గవ్వలపల్లి తదితరగ్రామాల్లో ధాన్యం కొనుగోలుకేంద్రాలను ఆయన పరిశీలించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ తూకంలో అవకతవకలకు పాల్పడితే కఠిన చర్యలుంటాయని హెచ్చరించారు. రైతులు పండించిన చివరి గింజ వరకు వరి ధాన్యాన్ని కొనుగోలు చేస్తామని ఆయన తెలిపారు.